క్లుప్తంగా

ఇరిగేషన్ కార్యాలయం ప్రారంభం

సూళ్లూరుపేట : పట్టణంలో డీఓఎస్ కాలనీ పక్కనే నూతనంగా నిర్మించిన సాగునీటి పారుదల కార్యాలయం భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులమీదుగా లాంఛనంగా ప్రారంభించారు. పట్టణంలోని షార్‌రోడ్డుకు పక్కనే బంకింగ్ హాం కెనాల్‌కు సంబంధించి బ్రిటీష్‌వారు నిర్మించిన కార్యాలయ భవనం స్థానంలోనే ఈ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణం ప్రారంభోత్సవ శిలాఫలకంలో ప్రొటోకాల్ పాటించలేదు. వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధుల పేర్లను ఆఖరులో వేసి ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడం చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రీయ పోషణ్ మాసం ప్రారంభం


రాష్ట్రీయ పోషణ్ మాసం ప్రారంభిస్తున్న దృశ్యం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని పబ్లిక్ హెల్త్ సెంటనర్ల వద్ద బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసం 2025 కార్యక్రమంను సీడీపీఓ శంషాద్ బేగం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వంటకాల్లో చక్కెర, నూనె తగ్గించడం వలన పిల్లలను స్థూలకాయం నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి హరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

మాదన్నగారి పల్లెలో పోషణ మాసం

కలువాయి(సైదాపురం): మండలంలోని మాదన్నగారి పల్లి సచివాలయంలో బుధవారం డాక్టర్ అన్వర్‌బాషా, కుల్లూరు క్లస్టర్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషణ మాసం, స్వస్థ్ నారి స శక్తి పరివాహ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, మాదన్నగారి పల్లి, రామన్నగారిపల్లి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


బావిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్

ఓజిలి: తిరుమలపూడి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ పేర్కొన్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పనులను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ. 17.5 లక్షలతో తాగునీటి బావి, ఎస్సీ, ఎస్టీ, మెయిన్ విలేజ్‌కు పైపులైను సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. గతంలో బావి వద్దకు వచ్చి తాగునీటిని తీసుకెళ్లేవారన్నారు. ప్రస్తుతం ఇంటింటికీ కుళాయి కనెక్షన్ మంజూరు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలియజేశారు. ఈయన వెంట సర్పంచ్ ఏకసిరి గోపాలయ్య ఉన్నారు.

ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ వితరణ



చిల్లకూరు : మండలంలోని బూదనం పంచాయతీలోని పట్రగుంటకు చెందిన దివ్యాంగునికి బుధవారం ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ చేయూతనిచ్చారు. గ్రామానికి చెందిన గొర్రెపాటి వెంకటరమణయ్య రోడ్డు ప్రమాదంలో కుడి కాలును పోగొట్టుకున్నాడు. దీంతో అతను ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బంది పడుతున్నారు. స్థానికంగా ఉండే టాటా కన్సల్టెంట్‌లో పని చేసే మస్తాన్‌కు విషయం తెలియడంతో ఆయన నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పొట్టెంపాడు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుండా సందీప్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన తన తల్లి సుహర్లత జ్ఞాపకార్థం రూ.35 వేల విలువైన ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌ను వితరణగా అందించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

సూళ్లూరుపేట : మండలంలోని గోపాల్‌రెడ్డి పాళెం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 29 మందికి ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారు నోట్ పుస్తకాలు, ఆట వస్తువులను ఎంఈఓ సునీల చేతులమీదుగా బుధవారం అందజేశారు. గిరిజన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైలు పట్టాలపై మహిళ మృతదేహం

వెంకటగిరి రూరల్ : గుర్తు తెలియని మహిళ (55) మృతదేహం రైలు పట్టాలపై బుధవారం కనిపించిన ఘటన ఎల్లకారు- శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న గూడూరు రైల్వే ఎస్ఐ చెన్నకేశవులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆకు పచ్చ చీర కట్టుకున్న మృతురాలు వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృత దేహంను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలియజేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు 18-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	147
లేయర్ లైవ్	:	115
బ్రాయిలర్ చికెన్	:	260
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	286
లేయర్ చికెన్	:	195

వృథాగా సంపద కేంద్రాలు


వెదురుపట్టు గ్రామంలో సంపద తయారీ కేంద్రం


పిచ్చి మొక్కల మధ్యకు చేరిన చెత్త బండి

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వృథాగా దర్శనమిస్తున్నాయి. వెదురుపట్టు గ్రామంలో సంపద తయారీ కేంద్రం దారుణంగా పిచ్చి మొక్కల నడుమ దర్శనమిస్తోంది. గ్రామంలోని తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి దాంతో వచ్చే నగదుతో గ్రామాభివృద్ధికి వినియోగించే ఉద్దేశంతో దీన్ని నిర్మించారు. కానీ ఇక్కడ సంపద తయారీ కేంద్రం అధ్వాన్నంగా తయారైంది. నిర్వహణ లోపంతో పిచ్చి మొక్కల నడుమ పాతబడిన షెడ్‌ను తలపిస్తోంది. చెత్త సేకరించే చెత్త బండ్లు పిచ్చి మొక్కల మధ్య మరమ్మతులు నోచుకోకుండా ఉన్నాయి. కేంద్రంలో చెత్తా చెదారంతో ఉండాల్సిన తొట్టిలు మట్టితో నిండిపోయి ఉన్నాయి. దీన్ని నిర్వహణ బాధ్యతగా చూసుకోవాల్సిన గ్రామ సచివాలయం సిబ్బంది, పంచాయతీ పాలకులు పూర్తిగా గాలికి వదిలేయడంపై స్థానికులు నిట్టూరుస్తున్నారు.


సంపద తయారీ కేంద్రంలో మట్టితో నిండిపోయిన తొట్టిలు

పార్టీ అధినేతతో భేటీ


అధినేత జగన్‌ను సత్కరిస్తున్న పార్టీ నేతలు

గూడూరురూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని నివాసంలో గూడూరు జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి, గూడూరు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జగన్ మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. పార్టీ పరిస్థితి, కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై చర్చించారు. జగన్‌ను కలిసిన వారిలో పార్టీ నాయకులు తిరుపాలయ్య, గోపాల్, రాజశేఖర్, మహేంద్రరెడ్డి ఉన్నారు.

ప్రధాని జన్మదిన వేడుకలు

నాయుడుపేటటౌన్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు బుధవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద అన్నదానం చేశారు. బీజేపీ నాయకులు ఏవీఎస్ రవీంద్ర ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు

పెళ్లకూరు: ప్రధాని నరేంద్రమోదీ జీవితం ప్రజాసేవకే అంకితం చేసి దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీజేపీ శ్రేణులు 28మంది రక్తదానం చేశారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం అందజేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు.


పెళ్లకూరు పీహెచ్‌సీలో రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

వృద్ధాశ్రమంలో ఫలహారం పంపిణీ

చిల్లకూరు: ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని గూడూరులోని అమ్మ దయ వృద్ధాశ్రమంలో పండ్లు, ఫలహారం పంపిణీ చేశారు. పట్టణంలో కంకణాల పెంచలనాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేపట్టారు.

మేరిగ లీలావతమ్మకు నివాళి

రామచంద్రాపురం: స్టేట్ కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ మేరిగ వేణుగోపాల్ రాజు, వాసుదేవరాజుల మాతృమూర్తి మేరిగ లీలావతమ్మ ఇటీవల కన్నుమూశారు. బుధవారం తిమ్మరాజుపల్లెలో నిర్వహించిన కర్మక్రియలకు గూడూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ హాజరై లీలావతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో మేరిగ మధుసూదన రావు, బాలాజి, రాజేష్ కుమార్, చిన్నబ్బ, మన్మధ రావు, తారకరాము, ముని భాస్కర్ రెడ్డి, తానికొండ నరసింహులు నాయుడు, శాంతి ఆశ్రమ పీఠాధిపతి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

సూళ్లూరుపేట: పట్టణంలో వెలసిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి బీ ప్రసన్న లక్ష్మీ తెలిపారు. తొమ్మిది రోజులు అమ్మవారిని తొమ్మిది అలంకారాలతో అమ్మవారిని దర్శించుకోవచ్చని చెప్పారు. శరన్నవరాత్రుల ప్రారంభం రోజున అంటే 22న గొల్లలములువు నుంచి అమ్మవారికి చీర, పసుపు కుంకుమలతో సారెను లాంఛనంగా అమ్మవారికి సమర్పిస్తారు.

అమ్మవారి అలంకారాలు

శరన్నవరాత్రుల్లో భాగంగా 22న శ్రీ పరమేశ్వరి ఆలంకారం, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణ, 25న అష్టకాళీ, 26న శ్రీ మహాలక్ష్మీ, 27న బాలాత్రిపురసుందరీ, 28న చండీ, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, 1న రాజరాజేశ్వరి, 2న మహిషాసుర మర్ధిని అలంకారాలతో అమ్మవారు దర్శనమిస్తారని తెలిపారు. విజయదశమి రోజున మూలవిరాట్టు అమ్మవారికి స్వర్ణ కిరీట దివ్య శోభిత అలంకారం అద్భుతంగా ఉంటుందని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు మహా చండీయాగం నిర్వహించనున్నట్లు వివరించారు. విజయదశమి రోజున అమ్మవారు మహిషాసుర మర్ధిని అలంకారంతో గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

అమృత్ భారత్‌కు నాయుడుపేటలో స్టాపింగ్

నాయుడుపేటటౌన్: జాగ్‌బాని(బీహార్) నుంచి తమిళనాడు ఈరోడ్ వరకు వెళ్లే అమృత భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు (16601-16602)కు బుధవారం నుంచి స్టాపింగ్‌కు అనుమతి వచ్చింది. దీంతో రాత్రి 9 గంటల తరువాత నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో నిలిపినట్లు అసోసియేషన్ అధ్యక్షులు మస్తానయ్య వెల్లడించారు. తిరిగి అమృత భారత్ వీక్లి ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం ఉదయం 7 గంటలకు తమిళనాడులోని ఈ రోడ్ నుంచి బయలుదేరి సేలం మీదుగా జాలర్‌పాట్టై, కాట్‌పాడి, అరక్కోణం, పెరంబూర్, నాయుడుపేట, గూడూరు, ఒంగోలు మీదుగా జాగ్‌బాని(బీహార్)కు అమృత భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు చేరుకుంటుందన్నారు. ఈ విషయమై స్థానిక రైల్వే సూపరింటెండెంట్ చిరంజీవిని సంప్రదించగా రాత్రి రైలు నిలిపే అరగంట ముందు మాత్రమే తమకు సమాచారం వస్తుందన్నారు.

కూలీలకు అండగా నిలవడం అభినందనీయం

చిల్లకూరు: వేసవిని తలపిస్తున్న ఎండలు మండిపోతున్న సమయంలో ఉపాధి పనికి వచ్చే కూలీలకు తమ వంతుగా కొంతమంది దాతలు ముందుకు వచ్చి వారి దాహార్తిని తీర్చడం ఎంతో అభినందనీయమని జిల్లా ఉపాధి పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మండలంలోని కలవకొండ గ్రామంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలకు స్థానిక క్షేత్ర సహాయకులు నల్లయ్య నీడ ఉండేలా పట్టను ఏర్పాటు చేయడం స్థానిక దాతల నుంచి మజ్జిగను తీసుకుని వచ్చి పని మధ్యలో అందించడం అభినందనీమని అన్నారు. ఆయన వెంట ఉపాధి ఏపీడీ వరప్రసాదరావు, ఏపీఓ గిరిబాబు పాల్గొన్నారు.


కూలీలకు మజ్జిగను అందిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఆవాస్ యోజన కరపత్రాల ఆవిష్కరణ

నాయుడుపేటటౌన్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన -అర్బన్ 2.0కు సంబంధించి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను కమిషనర్ కార్యాలయంలో బుధవారం పలు విభాగాల అధికారులు సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఆ పథకాలను ఇంటింటా ప్రచారం చేసే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఊరుకుందమ్మ, హౌసింగ్, టీట్‌కో తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిషనర్ షేక్ ఫజులుల్లా

విశ్వకర్మ జయంతి వేడుకలు

కలువాయి(సైదాపురం) : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ శైలజ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి ఎంపీడీఓ శైలజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారిటి శివకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ రమేష్‌బాబు, మండల పరిషత్ సీనియర్ సహాయకులు ఎం రమేష్‌బాబు, జూనియర్ సహాయకులు కేవీ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

ఈ పాస్ మెషీన్లు పంపిణీ

వాకాడు : మండలంలోని రేషన్ షాపు డీలర్లకు బుధవారం ఎంఎల్ఎస్ పాయింటు వద్ద నూతన ఈ పాస్ మెషీన్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్ పాల్గొని డీలర్లకు మెషీన్లు అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 30 రేషన్ షాపులు ఉన్నాయని, అందులో ఇప్పటి వరకు వినియోగిస్తున్న ఇ పాస్ మెషీన్లను తొలగించి కొత్తవి అందజేశారు.

వరి పంట పరిశీలన

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని వెంగమాంబపురం, అక్కసముద్రం గ్రామంలో దెబ్బతిన్న వరి పంటలను ఏఓ విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు సుమారు 83 ఎకరాల పంట భూమిపై నేలవాలిందన్నారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వలేకుండా రైతుల చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.


వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ విజయలక్ష్మి

మనోహర్ గౌడ్ సేవలు అభినందనీయం


మనోహర్ గౌడ్‌ను సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య.

చిట్టమూరు: మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన మనోహర్ గౌడ్ సేవలు అభినందనీయమని వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య పేర్కొన్నారు. చిట్టమూరు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై చిత్తూరు జిల్లా గంగధర నెల్లూరుకు వెళుతున్న మనోహర్ గౌడ్‌కు బుధవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంతగా సత్కరించారు. వాకాడు నుంచి బదిలీపై వచ్చిన ఎస్.ఉమామహేశ్వరరావు బుధవారం చిట్టమూరు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణరెడ్డి

ఓజిలి: ఎంపీడీఓగా ఎం నారాయణరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా బుచ్చి ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఓజిలి ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను ఏఓ అమృతవాణి, సిబ్బంది ప్రసన్న, నాగేశ్వర్‌రావు, రవీంద్రబాబు, ఈఓపీఆర్డీ రేణుక, పంచాయతీ కార్యర్శులు, సిబ్బంది మార్యదపూర్వకంగా కలిశారు. అనంతరం పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. మండలంలో ఎక్కడ తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగించి ఎరువులు త యారు చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.

అడవి చుట్టూ కందకాలు


అటవీ భూముల్లో కందకం తవ్విన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలంలో ఫారెస్టు భూముల్లో కలప మాయమవుతుందని ఈనెల 9న 'అడవి నుంచి కలప మాయం' అనే శీర్షికన ప్రచురితమైన సాక్షి కథనంపై అటవీశాఖ ఉన్నత అధికారులు స్పందించారు. కలువాయి మండలంలో వెంకటరెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి, కోటూరుపల్లి అడవి చుట్టుపక్క ల దారులు లేకుండా గాడి(కందకం) తవ్వించారు.

ఎంపీడీఓకు సన్మానం


ఎంపీడీఓ శైలజను సన్మానిస్తున్న అధికారులు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలో దాదాపు 15 నెలలుగా సుదీర్ఘకాలంలో ఇన్‌చార్జి పాలన సాగుతున్న నేపథ్యంలో రెగ్యులర్ ఎంపీడీఓగా శైలజ బాధ్యతలు చేపట్టారు. దీంతో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీఓ రమేష్‌తో కలిసి ఆమెను సన్మానించారు.

రాష్ట్ర తైక్వాండో పోటీలకు పేట క్రీడాకారులు

నాయుడుపేటటౌన్ : తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు నాయుడుపేటకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు స్థానిక తైక్వాండో మాస్టర్ ఉయ్యాల పవన్ కుమార్ బుధవారం తెలిపారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలను ప్రభుత్వ అధికారులు నిర్వహించినట్లు తెలిపారు. అండర్-17, 14 విభాగాల్లో నాయుడుపేటకు చెందిన బీ దీపిక, డీ అక్షయాని, ఎస్ బెన్‌హర్, పి.పూజిత, ఏ చార్లెస్ చంద్రహస్, తనిష్ నాయక్ ప్రతిభ చాటినట్లు మాస్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

క్రీడలను ప్రోత్సహించాలి

సైదాపురం: క్రీడలను ప్రోత్సహిస్తేనే క్రీడాకారులు రాణిస్తారని ఎంఈఓ బాల సుబ్రమణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని గోగినేని వెంకటసుబ్బానాయుడు ఉన్నత పాఠశాలలో బుధవారం అట్టహాసంగా స్కూల్ గేమ్స్‌ను ప్రారంభించారు. ఈ పోటీల్లో వాలీబాల్ విభాగంలో తురిమెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. బాలికల విభాగంలో సైదాపురం, అండర్-14 విభాగంలో కలిచేడు విద్యార్థులు విజయం సాధించారు. చెస్‌లో సైదాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలిచారు. బాలికల విభాగంలో ఊటుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. యోగాలో తురిమెర్ల, ఊటుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘన విజయం సాధించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

దక్కిలి: మండలంలోని వెంబులూరు గ్రామం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చెరుకూరు చెన్నయ్య ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. అదే పాఠశాలలో పనిచేసే నారే మల్లికార్జునరావు బదిలీపై వెళ్లారు. దీంతో వీరిద్దరినీ బుధవారం సహచర ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బెల్టుషాపులపై ప్రశ్నించేవారే లేరా?

బాలాయపల్లి(సైదాపురం): బెల్టుషాపులు అక్రమంగా గ్రామానికి నాలుగేసి పుట్టుకొచ్చాయని వాటిని అడ్డుకునేవారు... ప్రశ్నించేవారే లేరా అని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలం కేంద్రంలో ఉన్న స్త్రీశక్తి భవనంలో బుధవారం ఎంపీడీఓ వినీల్‌కుమార్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు, ఎక్సైజ్‌శాఖలు లాలూచి పడి బెల్టుషాపులు అక్రమంగా నడుపుతున్నారా ప్రశ్నించారు. మండలం అంతా విచ్చల విడిగా బెల్టుషాపుల నిర్వహిస్తూ ఉంటే పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారో తెలియడంలేదన్నారు. గూడూరు డీఎస్పీ, సబ్‌కలెక్టర్ స్పందించి గ్రామ ప్రజలు ఆరోగ్యాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నూతన ఎంపీడీఓ దాసరి నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ సందీప్, మండల శాఖ అధికారులు ఎంపీటీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గూడూరురూరల్ : దసరా ఉత్సవాలకు ముందుగా ఈ నెల 21న ఆదివారం నిర్వహించే జెండా ఉత్సవంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ గీతా కుమారి హెచ్చరించారు. పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఉన్న రోటరీ భవనంలో బుధవారం జెండా ఉత్సవం నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మైసూరు తరువాత స్థానంలో గూడూరు జెండా ఉత్సవం జరుగుతుందన్నారు. పండుగకు పలు ప్రాంతాల నుంచి ప్రజలు లక్షలాదిగా వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని జెండా ఉత్సవాన్ని నిర్వాహకులు కలసి మెలసి ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఆర్.వి.ప్రసాద్, సీఐలు శేఖర్‌బాబు, కిషోర్ బాబు, శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్ఐ మహేష్, డిస్కం ఏఈ ఏడుకొండలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రాపూరు: మండలంలో బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ప్రమీల రాజకుమారి పేర్కొన్నారు. బొజ్జనపల్లిలో వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సునందన, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

నాయుడుపేటటౌన్: మహిళలందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి జాగ్రత్తలు పాటించాలని సీడీపీఓ ఉమామహేశ్వరి, తుమ్మూరు వైద్యురాలు ఉమ్మే సల్మా సూచించారు. పట్టణంలో తుమ్మూరు వైద్యశాలలో మహిళలకు వైద్య చికిత్సలు నిర్వహించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

వైద్యశిబిరాలు వినియోగించుకోవాలి

ఓజిలి: మండలంలోని అత్తివరం, పెదపరియ గ్రామాల్లో స్వస్థ్ నారీ-సశాక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని వైద్యులు మోహన్‌రంగా, వినీషా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు సూచనలు సలహాలు అందించారు.

కొత్తపల్లిలో వైద్య పరీక్షలు

దొరవారిసత్రం : మండలంలోని కొత్తపల్లి గ్రామ సచివాలయం వద్ద భాగంగా వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య బీపీ, షుగర్, క్యాన్సర్, తల్లీబిడ్డా, పోషణ, వయోవృద్ధి పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, మానసిక వైద్య పరీక్షలు వంటివాటిపై అవగాహన కల్పించారు.


నాయుడుపేట: ఫోన్లలో యాప్‌లు డౌన్‌లోడ్ చేసి చూపిస్తున్న సీడీపీఓ

పోషకాహారంతో పండంటి బిడ్డ

చిల్లకూరు: గర్భిణులు తగిన రీతిగా పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే పండంటి బిడ్డకు జన్మనివ్వచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్ సుజనమ్మ తెలిపారు. గూడూరు పట్టణంలోని గంటకట్ట కాలువ, తాళమ్మ గుడి ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం రాష్ట్రీయ పోషణఅభియాన్ మాసోత్సవాలను ఆరంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

కోట/చిల్లకూరు/చిట్టమూరు: చిట్టేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం చిట్టేడులో వైద్యశిబిరం నిర్వహించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పథకంలో భాగంగా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక చికిత్స అందించనున్నట్లు వైద్యాధికారి నాగరాజు తెలిపారు. చిల్లకూరు పీహెచ్‌సీలో ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ ఆధ్వర్యంలో వైద్యులు అరాఫత్, నర్సింగ్ విద్యార్థులతో కలసి ర్యాలీ చేశారు. చింతవరం, వరగలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అవగాహన కల్పించారు. చిట్టమూరు పీహెచ్‌సీలో వైద్యాధికారిణి పద్మావతి అవగాహన కల్పించారు. అనంతరం బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ప్రత్యేక వైద్య శిబిరం

వాకాడు: వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం పీహెచ్‌సీ ఆవరణలో అసంక్రమిత వ్యాధులపై వైద్యులు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ తులసీదాస్ మహిళలకు ప్రత్యేక స్క్రీనింగ్ పరీలు నిర్వహించారు.